# ముఖచిత్ర మహోత్సవం

ముచ్చటైన ముఖచిత్రం ముద్రించడంలో "మెరుపు" పత్రిక అసమానఖ్యాతి గడించింది ముఖచిత్ర కళారాధకులంతా ఒకనాడొకచో సమావేశమై చక్కని ముఖచిత్రాన్ని అందిస్తూన్న పత్రికఏది? అని విచారించగా "మెరుపు" దగేల్న మెరసింది

ఆ సంవత్సరం బాలట్ Open చేసి ఓట్లు వెయ్యగా "మెరుపు" పత్రికక్కే ప్రథమ బహుమానం ఒచ్చింది అక్కణ్ణుంచి "మెరుపు" పత్రికసంపాదకుడు "యాస్ ఎడిటరుగా" మారి కూర్చున్నాడు

ఆ మరుసంవత్సరం మన ఏస్ పత్రికాధిపతికి సన్మానంచెయ్యాలి! అన్నారు అంతేకాదు ముఖచిత్ర మహోత్సవంకూడా జరిపించాలి అన్నారు

అన్నీ ఆయత్తం ఐనై! అజంతానగరంలో ఈ సన్మానోత్సవాన్ని జరపించడానికి ముఖచిత్ర కళారాధకులంతా నడుంబిగించేరు

అజంతా నగర వీధులన్నీ కళకళ్లాడుతున్నాయ్ ముఖచిత్రమహోత్సవానికి అనేక దేశదేశాలనుండి అక్కడికి పోగయేరు

ఓపెద్ద అంబారీఏనుగు, ఆఏనుగు ముఖానికో పెద్దపటం—ఏనుగు కడుపుచుట్టూ అనేకపటాలు తోరణం గుచ్చబడిఉన్నాయి, ఆపటాల్లోని చిత్రాలన్నీ ఎప్పుడో "మెరుపు" పత్రిక ముఖాన్ని అలంకరించినవే!

అంబారీలో ఏస్ సంపాదకుడు చిరునవ్వొలొల్కిస్తూ కర్పూర మాలాలంకృతుడై కూర్చున్నాడు ముందు కొందరు విద్యార్థులు కొన్నిపటాలు పట్టుకుని నడుస్తున్నారు గన్ సెట్, టకోరాలు మ్రోగిపోతున్నాయ్!

ఆ కన్నుల వైభవాన్నిచూచిన ఓ ఏస్ డైరెక్టరు "స్టుపిడ్ కంట్రోలర్ రాఫిలిం సరఫరా చేసుంటే ఓ టాపికల్ తీసిపారేద్దును!" అని ఎంతో 'ఫీ' లయేడు,

ఇంతలో సన్మానమందిరాన్ని సమీపించేరు మందిరంచుట్టూ అనేకచిత్రాలు తోరణాలుగా ఉన్నాయి అవన్నీ "మెరుప నుద్ధరించినవే!

మన ఏస్ ఎడిటర్‌గారు అంబారీదిగి లోనికి ప్రవేసిస్తూంటే

ముఖచిత్రాలంకరణ కళోద్ధారకా, బహూపరాక్, బహుపరాక్!

చిత్రవిచిత్ర ముఖపత్ర చిత్రాలంకారసేవా పరాయణా బహూపరాక్, బహుపరాక్!

అన్న నినాదాలతో లోనికిప్రవేసిస్తారు

సదరు సన్మానోత్సవానికి శ్రీ శ్రీ శ్రీ గజ్జతాసర్, ఇరాన్ బహుదూర్ వినయ విఘ్నేశ్వరాయులుంగారు అధ్యక్షతవహించేరు

సభలోంచి ఒకరులేచి కార్యక్రమప్రణాళికలో ప్రథమ ఐటం. "అధ్యక్షోపన్యాసం" అని చదవగానే బహుద్దర్‌వారులేచి

## "మహేశ్వర్"

సభాసదులారా! పత్రికాపాఠకులారా ఈనాడు మనమిక్కడ సమావేశమై ఒకొనొక ముఖచిత్ర కళారాధకుడికి సన్మానం చేయ్యడమేకాదు ముఖచిత్రమహోత్సవాన్ని దిగ్విజయంగా కొనసాగించినారు మీ దీక్ష కొనియాడ తగింది పత్రిక్కి ప్రాణాధారమైంది ముఖచిత్రం తొలుదొల్త పాఠకుణ్ణి ఆకర్షించేది ముఖచిత్రం !! లోపలివిషయాలు ఎలాఉన్నా ముఖచిత్రమేనా బావుందని పాఠకుడు సంతృప్తిపడతాడు పాఠకుణ్ణి సంతృప్తి పరచటమే సంపాదకుడి విధి! కనుక ముఖచిత్రంలో ఎంతవిలువుందో పాఠకులు కాదు, చూపరులే ఊహించాలి!! అంతేకాదు ఆ ముఖచిత్రం అద్దం కట్టించుకునేందుకు అవకాశంగాఉంటే పాఠకుడు మరింత తృప్తిపడతాడు ముఖచిత్రాలకి ప్రాధాన్యత ఇవ్వడంలో మన సంపాదకుల కృషి అమోఘం! ప్రశంసనీయం!

పత్రికంతా ఒకఎత్తు, ముఖచిత్రం ఒక ఎత్తు, అనడంలో అతిశయోక్తిలేదు!

(కరతాళధ్వనులు! ఏస్ ఎడిటర్‌కీ జేయ్ అన్న కేకలు)

తంవాత కార్యక్రమం ముఖచిత్రాల్ని ప్రశంసిస్తూ ఓగేయం

ఓగేయకవి లేచి

చిత్రం !  
విచిత్రం !!  
చిత్రాతి విచిత్రం  
విచిత్రాతి చిత్రం  
ముఖపత్ర చిత్రం !  
చట్రంకట్టించాల్సిన  
విలువ ఎంతైనాఉంది !!

*   *   *

పత్రికప్రాణం ముఖచిత్రం  
పత్రికాశయం ముఖచిత్రం  
పావల డబ్బుల ముఖచిత్రం  
పత్రిక చరిత్ర ముఖచిత్రం  
రంగు రంగులా ముఖచిత్రం  
ముఖచిత్రం ముఖపత్రం  
డిట్టో డిట్టో డిట్టో !!

*   *   *   *

వస్తోందోయ్  
వస్తోందోయ్  
విచిత్రాల ముఖచిత్రం  
మీమనసులు ఉసిగొల్పే  
మీకళ్ళని మింగేసే  
ముఖచిత్రం, ముఖపత్రం  
వస్తోందోయ్ వస్తోందోయ్  
పసందైన ముఖచిత్రం  
పదిరంగుల ముఖచిత్రం  
పావలా! పావలా! పావలా!

*   *   *   *

బిరుదు సమర్పణ, ప్రశంసాపత్రాల పఠనం. ఓ ఉభయభాషాప్రవీణ.

హృద్రమ్య వినూత్నశోభా ప్రపూరిత గ్లేమర్ గర్ల్స్ చిత్రాలంకృత ప్రవీణ చిత్ర విచిత్ర ముఖపత్రసంధాన దీక్షాధురీణ.

ఓ గ్రాడ్యుఏట్‌లేచి

"Tiger of the title [illegible]"

రెండు బిరుదు సంతర్పణలూ, లేక సమర్పణలూ, జరిగినతరువాత.

ఒకరులేచి ప్రశంశాపత్రాలు పఠిస్తారు

ఆర్యా.

ప్రతినెలా మీపత్రిక పైచిత్రాన్ని చూచి కొనడానికెంతో ఉబలాట పడుతూంటాను మీ పన్నెండుసంచికల తాలూకూ ముఖచిత్రాలు చించి ఓ ఆల్బం తయారుచేసుకున్నాను, ఇటు

పైని రాబోయే పత్రికమీద ముఖచిత్రం ముందుగా ప్రకటిస్తే ఎంతో బావుంటుంది మీ ముఖచిత్ర మహోత్సవానికి జేజేలు!!

ఇట్లు,
"చిత్రాల ముత్యాలరావు"

మరో లేఖ

మెరుపు పత్రికలోళ్ళకి

మీరు పుస్తగం మీదేసే బొమ్మలు కత్తిరించి, అతిసోగ్గా అద్దాలుకట్టేసి అమ్ముకోవటంవల్ల నా కెంతో లాభం ఒస్తోందాది! దయసేసి ప్రతీనెలా మీ పత్రికతాలూకు బొమ్మలుమాత్రం సింపి ఓ ఏబై పంపుతే డబ్బు కట్టేసుకుంటాను

ఇట్లు,
"పటాల సాయిబు"

తరువాత ఓ కళాభాయి ఉపన్యాసం

"సభ్యులారా! ముఖచిత్ర కథలింతవరకూ విన్నారు ఇందాకా ఆగేయకవి అన్నట్టు పత్రిక ప్రాణం ముఖచిత్రం! అక్షరలక్షలు!

విన్నొచ్చిన సంచికమీద "డరోతీబీగం" చిత్రాన్ని గురించి కాస్త ముచ్చటించ దలచేను

డరోతీబీగం గొప్ప సినిమాస్టారు ఆతారామణి ఒక మహమ్మదీయ యువతి మన ఏస్ ఎడిటర్ గారు ఆచిత్రాన్ని "ముఖం" చందంలో "ఉద్దేశం" మీకర్థంకాలేదనుకుంటాను అది "ఉద్దేశం" కాదు మహోన్నత సందేశం! ఆ సందేశాన్నే Suggestive గా ఒదిలేరు

తెలుగు పత్రికమీద మహమ్మదీయ యువతి చిత్రంవేసి హిందూముస్లిం సఖ్యతని ప్రోత్స హిస్తూన్న సందేశం!!

కాంతారాం లక్షలుకర్చుపెట్టి హిందూముస్లిం సఖ్యతకోచిత్రం సృష్టిస్తే మన Tiger of the title page ఒక్క ముఖచిత్రంలో ఇమిడ్చేరు

సభలో గుసగుసలు, తరువాత మహాగోలగా పరిణమి అందులోండి ఓ ఉద్దండపిండం లేచి

హిందూముస్లిం సఖ్యతోద్దేశమే అదైతే మహమ్మదీయ యువతి చిత్రానికి బదులు మహమ్మదీయ నిర్మాణమైన తాజ్‌మహల్‌ని ముద్రించకూడదూ?

అనగానే వాదప్రతివాదాలు ప్రబలినాయ్.

"ముఖచిత్రాలంకరణ కళోద్ధారకా! బహు పరాక్! బహు పరాక్!"

అన్న కేకలు వినబడతాయ్

ఆ కేకతో మన ఏస్ ఎడిటరుగారులేచి "సభ్యులకు వందనాలు! క్షమాపణలతో నే మనవి చేసేదేమంటే డరోతీ బీగంని ముఖచిత్రంగా వెయ్యడంలో నా కెటువంటి ఉద్దేశమూ లేదు

ఆమె "గ్రహచార్" అనే చిత్రంలో ఓ దాసీ పాత్రని అత్యంతరమ్యంగా ఒప్పించింది కవాలీ పాటలు అతికమ్మగా పాడుతుంది కాని ఆమె గ్రహచారంవల్ల మరెవరూ ఆమెను బుక్ చెయ్య లేదు నాదగ్గరకొచ్చి తనగురించి నాలుగు ముక్కలు రాయమంది ఆమెను ప్రోత్సహించా లన్న ఉద్దేశంతో ముఖచిత్రంగావేసి ఆమె గురించి నాలుగు ముక్కలు రాసేను తత్ఫలితంగా నూటపదహార్లు మా "మెరుపు"కి కాన్కగా చదివించింది!!"

దాంతో ఇరాన్ బహద్దూర్‌గారు లేచి "చాల గొప్పగా ఉంది మీ ముఖచిత్రాల కథ ఇహ నుంచి ఓ సంవత్సరంపాటు నా చిత్రాన్ని వివిధ భంగిమాల్లోనూ, త్రివర్ణాలలోనూ వెయ్యడానికేం పుచ్చుకుంటారు?"

"మెరుపు" సంపాదకుడికి ముచ్చమటలూ పోసి పోతై

ఇవతల పెద్ద మెరుపు, దాంతో ఓ ఉరుము— ఏనుగు బెదరి సభామండపాన్ని ప్రవేశించి ముఖ చిత్రపటాల్ని ముక్కముక్కలుచేసి పారేస్తుంది

తరువాత విషయాలు తబ్సీలువారీగా అజంతా నగర వార్తల క్రింద చూడండి

# అడవిపూవు

క్రకచానని కాంతారం—అల్లిబిల్లిగా అల్లుకొన్న పొదలమాటున తొంగిచూసే ఓ గులాబిమొక్క అంత మహారణ్యంలో ఒకే ఒక గులాబిమొక్క చిత్రం!

చిగురుటాకుల నడుమ వన్నెలొలికే గులాబిపువ్వు ఏ ప్రభాత మలయానిలపు గిల్లి మొగం విచ్చిందో — లావణ్య పటిమలోనూ పరిమళలహరిలోనూ లకు ఒరవడిదిద్దే ఆదర్శమూర్తి కవికుమారుని లేఖినికీ, చిత్రకారుని తూలికా క్రొత్తపోకడలు నేర్పే వంకలేని సోయగం

రేకలా?—అణువణువునా సౌకుమార్యం తొణికిస్తున్నవి పరిమళమా?—తెమ్మ తెమ్మెరలలో కమ్మదనం వెల్లివిరియిస్తున్నది తేనె!—తియ్యదనానికి తియ్యదనం నేర్పుతున్నది లావణ్యంలో తారుణ్యంలో, సౌరభ్యంలో, మాధుర్యంలో ఆ పువ్వు కాపువ్వే సాటి.

ఐతే ఏం? ఆ నిర్మానుషగహనాంతర సీమలో ఆ ఒంపులు తీరిన సోయగమూ, ఆ చలువలొలికే పరిమళమూ ఆ తొనుకులాడే మధుకణమూ ఎవరి కోసరం?

ఏ ప్రేమపూజారిణీ తన హృదయనాథునుపాసించడానికా పూవును కోయలేదు ఏ జనయిత్రీ కన్నబిడ్డ ముంగురులలో ముడువడానికా పూవును కోరలేదు ఏరసజ్ఞుడూ ఆ పూవు సొగసుదనానికి అనుభూతి పొందలేదు ఏ భ్రమరరాజూ మధుగ్రహణానికా పూవును చేరలేదు

ఉహూ—ఆ పూవు ముద్దుముచ్చటలు తీరనేలేదు అట్లానే ఆరేత చిగుళ్ళ నడుమ చలనం లేని భంగిమలో జాలిగా చూస్తూ ఉండిపోయింది పాపం! "మళ్ళీ ఎన్నటికీ ఇటువంటి నిర్జనారణ్య సీమలో ఉదయించే బ్రదుకు కలుగకూడ"దని తపస్సు చేస్తున్నదా అనిపించింది మఱి అదిమాత్రం అన్ని పూలకుమల్లే పుట్టలేదూ? దానికిమాత్రం కోరికలుండవూ? అలకించే నాథుడుండేనా?

కాలచక్రపు దొర్లింతలో ఆపూవు జీవనపరిమితి కూడా తిరిగిపోయింది కనికరం తెలియని కఠినవిధి కర్కశ కరాలలో పూవువన్నె వాడిపోయింది తొడిమవీడి భూమాత ఒడిలో నిదురపోయింది

ఐతే ఏం?—ఆ పూవుకోసరమిన్ని వేడికన్నీళ్ళు రాల్చినప్రాణి ఆ వనంలో ఒక్కటీ లేదు

మఱి ఎన్నిపూవు లిలావాడిపోతున్నాయో?

—అడపా రామకృష్ణారావు